కథా నిలయం
1471
శ్రీకాకుళం

ఆశలు-హాస్యాలు

"ఏమండోయి కవిగారు—!" అన్న పిలుపు వినిపించటంతో రోడ్డుమీద నడుస్తున్న శ్రీధరం ఓ క్షణంసేపు నిలబడి తాపీగా వెనక్కు తిరిగి చూచాడు.

"ఏరా గురూ! రోడ్డుమీద నడుస్తున్నప్పుడుకూడ అంత పరధ్యానమైతే యెట్లా?— అప్పటికీ మూడుమార్లు గొంతు చించుకుని పిలిస్తేనేగాని పలక్కపోతివి" అంటూ గబగబా దగ్గరికి వచ్చాడు భారవి.

"ఇంతకూ ఏమిటి విషయా" లన్నట్లు భారవి కళ్ళల్లోకి చూస్తున్న శ్రీధరాన్ని 'సరే అబ్బాయి అంతతొందరైతే

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 25-6-65 సంచికలో ప్రచురితము

మెట్లా ?!—' అని భుజంతట్టి ప్రక్కనేవున్న హోటల్లోకి నడిపించాడు.

పాతికేళ్ళయినా పూర్తిగ నిండని శ్రీధరం పూర్తి పాతకాలపు ఛాందస కవిలాగ అవుపిస్తాడు పైకి. తన వేష ధారణలోనే, వీడొక కవి గాబోలని అందరు అనుకోవాలని వాడి ఆశ—

బిస్కట్టురంగు సిల్కు లాల్చి, మధ్య పాపిటి, కళ్ళకు జోడు, భుజాలమీద వల్లెవాటుగా వ్రేలాడే కాఫీరంగు కాశ్మీరు శాలువ (చౌకరకంది), అదీ వాడి అలంకారం. (కాని బి.సి. నాటి సంగీతం మాస్టారులా వున్నాడని వాడికేం తెలుసు.)

శ్రీధరం అలంకారం ద్వారా ఒక కవిలాగు కన్పించటమేగాకుండా, పలుకరించిన ప్రతివాడితో తలనొప్పి పుట్టించే కేవలం గ్రాంథికం సంభాషిస్తాడు.

ఆనాటి శ్రీనాథుడెంత ?— తిక్కనెంత ? అనేశక్తి లేక పోయినా, ఛందస్సుతోగూడి, క్రమబద్ధంగావుండే కాసిని పద్యాలు, బోలెడు గేయాలు వ్రాసాడు. కాని తనొక గొప్ప కవిలాగ ప్రస్తుత ఆంధ్ర దేశంలో పరిగణింపబడి వన్నెకెక్కాలని, కక్కుర్తిపడే అలవాటు శ్రీధరంలో అంకురించింది. అదే బలీయమైన ఆశగా వాడిలో జీర్ణించుకుపోయింది.

కాలేజీలో చదివేరోజులనుండి, కన్పించిన తెల్లకాగితాన్నల్లా నలుపు చేయటం వాడి అలవాటు. ప్రతి నోట్సులోను ఏ విరహ గీతమో, విలాపగేయమో కన్పిస్తుంది. ఖర్మం,

వో గరల్ స్టూడెంటు యే విషయం గురించయినా పలుకరించటంజరిగితే "బాలామణీ! తమ నామధేయం బెయ్యది? నన్నివిధంబుగ పలుకరించుటలోగల భావంబు విశదంబు చేయుడీ!!—" అంటు వెధవమొహం పెట్టేవాడు.

శ్రీధరం నిజానికి కాస్తో కూస్తో సాధనచేసి ఒక రచయిత కోవలోకి వచ్చాడనే చెప్పవచ్చు. కాని వాడు ఆశించినంతగా పత్రికా ప్రచురణలద్వారా వాడు రచనలకు ప్రోత్సాహం కన్పించక పోవటంతో, నిరుత్సాహపడ్డాడనే చెప్పాలి! అప్పటికి రచయితగ తనక్కావలసిన 'బైరాగి చిట్కాలన్నీ కరతలామలకం చేసుకున్నాడు— చివరకు తనొక 'నశీబు' లేని కవిని గాబోలని అప్పుడప్పుడు వాడిలో వాడు గొణుక్కుంటు వుంటాడు.

క్రొత్త కథ వ్రాసినప్పుడల్లా పదిమంది ఫ్రెండ్సును పోగుజేసి వినిపిస్తాడు. వద్దు మొర్రోని వచ్చిన వారంతా వాడి కథ వినేందుకు అభ్యంతరం చెప్పినా, వాళ్ళను కాఫీతో సత్కరించి, వలసిన వారికి 'ఆస్ప్రో' తెప్పించి మరీ విన్పించేవాడు. ఇంతాచేసిన తరువాత 'నీకథ ఏడిసినట్టుంది! ఇలాటి రచనలు వ్రాయమని యెవరు ఏడిచార'ని అంటే శ్రీధరంగాడి మనస్సెక్కడ నొచ్చుకుంటుందో నని "చాలా బావుందోయి నీకథ! అసలీమధ్య ఇలాంటి రచనలకే పత్రికలవారు ప్రోత్సాహం యిస్తున్నారు. మా మాటవిని ఏపోటీకైనా పంపించు. ప్రథమ బహుమతి తప్పకుండ నీకేవస్తుంది!" అని పూరడించటంతో పొంగిపోయేవాడు.

ఎక్కడో, ఏ గురుకులంలోనో పుట్టి వున్నతోన్నత పరిమాణాలను అందుకోవలసిన శ్రీధరం, ఖర్మగాలి చివరకు గుమస్తాగిరి చేయాల్సివచ్చింది. ఓరోజున వాడి రూమ్మేట్సుతో బాతాఖాని కొడుతూ నేటి రచనలను, రచయితలను విమర్శించి ఆఁ—ఏముందోయ్, ప్రతిరచయితా స్త్రీ పాత్ర గాని, ప్రేమ సన్నివేశాలు గాని లేకుండా కథలే వ్రాయటం లేదు. అసలు క్రొత్తపంథాలో వ్రాయాలంటే వాళ్ళ చేత నేమౌతుంది? అంటూ తనఅక్కసు వెళ్ళబోశాడు. మళ్ళా తన సహజ ధోరణిలో, "వరేరావు! నిజానికి మనం చదివే ప్రతి కథలోను "సునందినిని సుబ్బారావు బస్టాండులో కలుసుకున్నాడు, అర్ధరాత్రిపూట మెట్రిక్ చదివే మాష్టారమ్మాయి పక్కయింటి రవిగాడి అందంచూచి, వరించి గదిలో జొరబడ్డది, లేదా, వాసంతి మల్లెపూల పందిరిక్రింద పేపరు చదువుతూ పడుకొంటే, శేఖరం ముద్దెట్టుకోబోయాడు" అన్నీ యిలాంటి 'సిల్లీ' సన్నివేశాలే గదుటోయ్" అంటూ వుక్రోషంతో మాట్లాడి కళ్ళల్లో నీరు నింపుకునేవాడు.

పాపం వాడి బేలహృదయానికి ఫ్రెండ్సు జాలిపడి ఓదారుస్తూ "వరే అబ్బాయ్! దేనికైనా కాలం కలసిరావాలోయ్ నువ్వు మాత్రం ఏం చేయగలవు చెప్పు?! నువ్వు వ్రాసే ప్రతి కథలోను, గేయంలోను ఏదో కొత్తదనం వున్నా, పత్రికల వారిని ఆకట్టుకునే, ఆకర్షణీయమైన అసలు సిసలైన 'చమక్కు' లేవీ వారికి కన్పించటంలేదేమో! పాపం తిరుగు టపాలోనే శఫీమని నీ రచనలన్నీ తిరిగొస్తున్నయ్. ఎందుకైనామంచిది గుండె ధైర్యం తెచ్చుకుని ఇలాగే 'ట్రయ్' చేస్తూవుండు.

నీకూ ఓనాటికి 'స్టార్' తిరిగి గుడ్డేటున ఓ కథగాని, గేయం గాని పడటం జరిగితే నీకూ అదృష్టం తిరగవచ్చు! ఇకనువ్వు ఏ చెత్తరచన పంపినా పంపక పోయినా, "మీ కథలను ప్రచురించవలసినదిగా పాఠకులనుండి జాబులొస్తున్నాయంటూ" పత్రికల వారే నీవెంటబడతారు !!" అంటూ వారి అమూల్యమైన సలహాలతో శ్రీధరాన్ని ఓదార్చారు.

అసలీరోజుల్లో ప్రతివ్యక్తిలోను ఓవిచిత్రమైన మనస్తత్వం కన్పిస్తూవుంటుంది. తనొక రచయిత కావాలని, లేదా వెండితెరమీద తన ముఖం కన్పించాలని, కాకపోతే రేడియోద్వారా తన కంఠాన్ని శ్రోతలకు విన్పించి తను తరించాలనీ!! ఈ మూడు కోరికలు బలీయంగా పీఠం వేసుకున్నాయి.

పైన చెప్పిన మూడురకాల్లో మొదటికోవకు చెందినవాడు శ్రీధరం. వాడిని చూచిన ప్రతివాడు "వరేయి! ప్రఖ్యాత రచయిత!! మొన్న కథలపోటీలో బహుమతి గెల్చుకుంది వీడే! నిన్న సన్మానం జరిగిందికూడ ఈయనకే!!—" అని అనుకోవాలని, అక్కడితో యెక్కడలేని పేరు ప్రఖ్యాతులు వాడిని ఆకాశానికి తీసుకెళ్ళాలనీ, లేకపోతే వాడిని చూచిన ప్రతి అమ్మాయి ఆమెకై ఆమే చిరునవ్వుతో పలుకరిస్తూ "మీ కథలెంత చమత్కారంగా వుంటాయండీ! మీ రచనలు నన్నెంతగానో ఆకర్షించాయి! మీ ఆటోగ్రాఫ్ గాని, ఫోటోగాని ఇస్తారా !? నా ఆల్బమ్‌లో దాచుకుంటాను, మిమ్మల్నే ఆరాధిస్తాను. ప్రేమిస్తాను" అనంటూ వాడిచుట్టు

తిరిగి, వాడిని పొగిడేయాలని శ్రీధరం ఆశలు. కాని వాడి ఆశలన్ని హాస్యాస్పదమవుతున్నందుకు ఫ్రండ్సంతా విచారిస్తుంటారు.

ఇంతకు అసలు విషయానికి వద్దాం! అలా హోటల్లోకి లాక్కెళ్ళిన శ్రీధరాన్ని, భారవి భారంగా బైటికి తీసుకొచ్చి, ఓ సిగరెట్టు కొనిపెట్టి, "ఒరేయ్ శ్రీధరం! నీరూముకెల్దాం పద!! అక్కడ తీరుబడిగ మాట్లాడుకోవచ్చు! ఇక్కడైతే పదిమంది వింటారు" అనటంతో ఇద్దరూ నడక వేగం హెచ్చించారు.

అప్పటికి రాత్రి ఏడుగంటలవుతూంది. రూము తాళం తీసి లోపలికి వచ్చి లైటు వేశాడు శ్రీధరం. వాల్చివున్న ఈజీచైరులో భారవి కూర్చుంటూ ప్రక్కనే వున్న 'కాంపు కాటు' మీద కూర్చోమన్నాడు శ్రీధరాన్ని.

"ఇంతకూ ఏమిట్రా అసలు విషయం?" ఉండబట్టలేక అడిగాడు శ్రీధరం. 'ఆగవోయ్! కాస్సేపు తిన్నగ నన్ను వూపిరి పీల్చుకోని! నీ వెధవ గదిలోకి కనీసం మంచి గాలి అయినారాదు' అంటూ తాపీగా సిగరెట్టు ముట్టించాడు.

శ్రీధరంలో ఆత్రుత యెక్కువగా ప్రారంభించింది. ఏం చెబుతాడనే ఆపేక్షతో భారవి ముఖంలోకి కళ్ళార్పకుండా చూస్తున్నాడు, ఆశగా!

"ఒరేయి శీధరం! అసలు విషయం ఇది. ఎవ్వరితోను అనకు. నీలోనే వుంచుకో! మేమంతా అనుకున్న ప్రకారం ప్లాను నిర్విఘ్నంగ జరిగితే నీవదృష్టవంతుడి వైపోతావు.

ఒక్కమ్మడిగా నీపేరు ఆచంద్రతారార్కం చిరస్థాయిగ ప్రతి పేపర్లో పెద్ద అక్షరాల్లో నిలిచిపోతుంది. ఎలాగయినా నిన్నూ, నీ గొప్పదనాన్ని పదిమందిలోకి తీసుకువచ్చి, నిన్ను ఒక కవిగా అందరికీ ఎరిగించాలని ఫ్రండ్సంతా కలసి తాపత్రయ పడి ప్లానొకటి వేశాం!—కాని నా "రిక్వెస్టు" వక్కటే. మేం చేయబోయే ప్రతిపనికి తలూపి సరేనను అంతేగాని వెధవ అడ్డు ప్రశ్నలువేసి మా ప్రాణం తియ్యొద్దు!" అని చెప్పుకు పోతున్న భారవి ధోరణిచూచి విసుక్కున్నాడు శ్రీధరం.

పూర్తిగా చెప్పనివ్వకుండా మధ్యలో అడ్డొస్తూ "ఏమి టోయి నీసోది ? — అసలు సంగతేమిటో చెప్పరా తండ్రీ చంపక " అంటూ బుంగమూతి పెట్టాడు.

శ్రీధరం అవస్థచూచి జాలిపడ్డ భారవి "ఒరే కవీ ! నీకు కలసివచ్చేకాలం ఆసన్నమవుతున్నదిరా ! ఆ తర్వాత మేం నీకు కనిపిస్తామాని, నా అనుమానం"

"భారవీ ! నీ తలతిరుగుడు మాటలతో నాకు నిజంగ తలభారం వస్తోందిరా!! కొంపదీసి ఇంతకు నా కథేదైనా, నాకు తెలియకుండానే, ఏ పత్రికలోనైనా ప్రచురింపబడటం జరిగిందా ? — నిజం చెప్పరా సస్పెన్సులో పెట్టిచంపక ! బాబ్బా—బు !" అంటూ తనలోవున్న అమాయకత్వాన్ని వెలిబుచ్చాడు.

"ఓరి వెర్రిపీనుగా ! నీకు అంతటి అదృష్టం పడితే లేనిదేముంది ? మా అందరి బాధగూడ అలాంటి ఛాన్సలే నీకు త్వరలో రావాలనీ, ఆంధ్ర పాఠకలోకానికి నువ్వు ఒక

రచయితగా పరిచయం కాబడాలనే !!" అంటూ ఫ్రేము కట్టించిన ఒక సన్మాన పత్రంలాంటిది శ్రీధరానికి అందించాడు. అమాంతంగా దాన్ని చేతిలోకి లాక్కుని ఆత్రంతో చదివాడు. పెద్దపెట్టున నవ్వాడు. చిన్న కూనిరాగం తీశాడు. కంటిలో ఆనందాశ్రువులు కదం తొక్కినయ్.

శ్రీధరం పరిస్థితి అయోమయమైంది. పట్టలేని ఆనందాన్ని ఆపుకుంటూ "ఒరే భారవీ! నీ తెలివి చాలా అమోఘంరా!! కానీ నాకో చిన్న సందేహం...నాకు రేపు మీరు చేయబోయే సన్మానానికి అసలెవరైనా జనం వస్తారా?—"

"ఒరే చిట్టితండ్రీ! నే ననుకుంటున్న చొప్పదంటు ప్రశ్నే వేశావు! శుభం పలకరా మంకెన్నా అంటే యెవడో యేదో కూశాడుట. అట్లావుంది నీ ప్రశ్న! ఈ సన్మానపత్రం నీకు సమర్పించటంలో అసలు రహస్యం యిది! జాగ్రత్తగా విను. ఒకవేళ నీగుండె ఆగిపోతుందేమో! యెందుకైనా మంచిది మనస్సు కుదటబరుచుకుని మరీవిను — పదిరూపాయలు అప్పుచేసి అందరం కలిసి సన్మాన పత్రాలు వేయించాం! ముందుగానే ఊరంతా పంచిపెట్టాం! అంతే, నీకు సన్మానం జరిగినట్టే— ఇదంతా కేవలం పబ్లిసిటీ స్టంటు — లేకపోతే నీకు సన్మానమేమిటిరా! నా మొహం ... చివరకు ఇప్పుడు జరుగబోయేది మాత్రం సింపుల్‌గా నలుగురం కలసి ఫొటో స్టూడియోకి వెళ్ళి కుర్చీల్లో కూర్చుని, నీ మెడలో పూలదండ వేస్తున్నట్లు, నీకో సన్మానపత్రం సమర్పిస్తున్నట్టు ఫొటో తీయించి పేపరుకు పంపిస్తాం! స్థానిక స్వవిలేఖరి

యెట్లాగు మనవాడే గాబట్టి, నీ ప్రతిభను గురించి దంచి పారేస్తూ పాతికలైన్లు వ్రాస్తాడు. ఆదెబ్బతో నీకు సుడి తిరుగుతుంది— నీ దురదా అణుగుతుంది" అని అసలు రహస్యం వెలిబుచ్చాడు భారవి.

నిరుత్సాహంతో గుడ్లు తేలవేసిన శ్రీధరం వువెత్తున లేచిన వాడల్లా చప్పగ చల్లారిపోయి, మూర్ఛవచ్చిన వాడల్లే పెద్దకేకేసి అమాంతం 'కాంపుకాటు' మీద వళ్ళు తెలియకుండ పడిపోయాడు.

భారవి మంచినీటి కూజా కోసం గది నాలుగు మూలలు వెతక నారంభించాడు.